సాక్షి
నల్లగొండ
గురువారం : 2 : జనవరి : 2025



చితకబాదిన పోలీసులు

దళితుడిని పోలీసులు చితకబాదిన ఘటన నూతనకల్ మండల కేంద్రంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. - 8లో



వ్యక్తి దారుణ హత్య

భూతగాదాల నేపథ్యంలో చివ్వెంల మండలం లక్ష్మణ్‌నాయక్‌తండాలో మంగళవారం వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. - 8లో



ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి..

యువత ఉద్యోగాలు ఇచ్చేస్థాయికి ఎదగాలని ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ చైర్మన్ మనోజ్‌కుమార్ అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

అసిస్టెంట్ ఎస్పీ బాధ్యతల స్వీకరణ



మాట్లాడుతున్న ఏఎస్పీ మౌనిక

దేవరకొండ : దేవరకొండ అసిస్టెంట్ ఎస్పీగా పి.మౌనిక బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ డీఎస్పీగా పనిచేసిన గిరిబాబు బదిలీపై హైదరాబాద్‌కు వెళ్లడంతో తెలంగాణ ఐపీఎస్ క్యాడర్‌కు చెందిన మౌనిక దేవరకొండ అసిస్టెంట్ ఎస్పీగా నియమితులయ్యారు. ఏఎస్పీ మౌనిక గతంలో గ్రేహౌండ్స్ ఏఎస్పీగా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేవరకొండ డివిజన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రత్యేక కార్యాచరణతో శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన ఆమెకు పోలీసు అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లా పంచాయతీ అధికారిగా వెంకయ్య

నల్లగొండ : జిల్లా పంచాయతీ అధికారిగా వెంకయ్య రానున్నారు. ప్రస్తుతం జిల్లాలో పనిచేస్తున్న మురళిని బదిలీ చేశారు. వెంకయ్య మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నుంచి నల్లగొండకు రానున్నారు. మురళి పంచాయతీల పర్యవేక్షణ విషయంలో పట్టీపట్టనట్లుగా వ్యవహరించడంతో పాటు పని చేయని కార్యదర్శులపై చర్యలు తీసుకోకపోవడం, కార్యాలయానికే పరిమితం అవుతుండటంతో కలెక్టర్ కొంత కాలంగా ఆయన్ను మందలిస్తున్నట్లు సమాచారం. అయినా పనితీరులో మార్పు రాకపోవడంతో ఆయనపై బదిలీ వేటు వేసినట్లు తెలుస్తోంది.

బుద్ధవనం సందర్శన



బుద్ధుడి పాదాలకు పుష్పాంజలి ఘటిస్తున్న బెల్లయ్యనాయక్

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని హిల్‌కాలనీలో బుద్ధవనాన్ని తెలంగాణ రాష్ట్ర గిరిజన సహకార అభివృద్ధి కార్పొరేషన్ (ట్రైకార్) చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా బుద్ధవనంలోని బుద్ధుడి విగ్రహాన్ని, పాదాలను సందర్శించి పుష్పాంజలి ఘటించారు. బుద్ధుడి జీవిత చరిత్రను తెలుసుకున్నారు. ఆయన వెంట కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు కేతావత్ నాగేశ్వర్‌రావు, సఫావత్ పాండునాయక్, మేరావత్ మునినాయక్, హరినాయక్, రాజు, సూరి, లాలు, నరేష్ తదితరులు ఉన్నారు.

సివిల్ సప్లయీస్ హమాలీల సమ్మె



సమ్మెలో పాల్గొన్న హమాలీలు

నల్లగొండ టౌన్ : ప్రజా పంపిణీ పథకం కింద రేషన్ బియ్యం గోడౌన్లలో పనిచేస్తున్న హమాలీలు బుధవారం నుంచి నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా నల్లగొండలోని గోదాం వద్ద సివిల్ సప్లయీస్ హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పల్లా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం యూనియన్లతో చేసుకున్న ఒప్పందాలను అమలు చేయడం లేదన్నారు. ప్రభుత్వం ఒప్పందాన్ని అమలు చేయనందుకు నిరసనగా హమాలీలు నిరవధిక సమ్మె చేపట్టారన్నారు. సమ్మె వల్ల బుధవారం నుంచి ప్రజలకు రేషన్ బియ్యం అందే అవకాశం లేకుండా పోతుందన్నారు. హమాలీల సమస్య పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దోనకొండ వెంకటేశ్వర్లు, జానయ్య, నాగరాజు, బుచ్చయ్య, గిరి యాదయ్య, లింగయ్య, సైదులు, ఎల్లయ్య, రామస్వామి, జానీ శ్రీను, లక్ష్మయ్య, వెంకన్న పాల్గొన్నారు.

న్యూ ఇయర్ సందడి



నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం నల్లగొండలోని రామగిరి రామాలయంలో అమ్మవారి సేవలో పాల్గొన్న భక్తులు



నల్లగొండలోని దేవరకొండ రోడ్డులో గల మరియమాత చర్చిలో ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవులు



కనగల్ మండలం శాబ్దుల్లాపురంలో పొలం వద్ద కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకుంటున్న మహిళా కూలీలు

‘టన్నెల్’కు మోక్షం

ఏప్రిల్ నెలాఖరులో పునః ప్రారంభం కానున్న పనులు

- గత నెల 15నే అమెరికా నుంచి బేరింగ్ షిప్పింగ్
- ఫిబ్రవరి 15నాటికి మన్నెవారిపల్లికి చేరుకునే అవకాశం
- బేరింగ్ బిగింపునకు రెండునెలల సమయం
- ఆ తర్వాత పనులు చేపట్టేలా అధికారుల ప్రణాళిక



మెయిన్ బేరింగ్ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 3 లక్షల ఎకరాలకు సాగు నీరు, 516 ఫ్లోరోసిస్ బాధిత గ్రామాలకు తాగునీరు అందించే లక్ష్యంతో చేపట్టిన ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులకు త్వరలోనే మోక్షం లభించబోతోంది. వచ్చే ఏప్రిల్ నెలాఖరులో టన్నెల్ తవ్వకం పనులు పునః ప్రారంభం కాబోతున్నాయి. టన్నెల్ బోరింగ్ మిషన్ (టీబీఎం) బేరింగ్ పాడైపోవడంతో ఏడాది కాలానికిపైగా పనులు నిలిచిపోయాయి. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ టన్నెల్ పనులపై దృష్టి పెట్టింది. 2024 ఆగస్టులో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్వయంగా అమెరికా వెళ్లి టీబీఎం బేరింగ్, ఇతర పరికరాల కోసం రాబిన్స్ కంపెనీకి ఆర్డర్ ఇచ్చి వచ్చారు. బేరింగ్ తయారీ పూర్తి కావడం, దాని షిప్పింగ్ కూడా గత నెలలోనే పూర్తయింది. త్వరలోనే అది రానుండగా, ఏప్రిల్ నెలాఖరులో పనులను ప్రారంభించేందుకు అవసరమైన ముందస్తు పనులను సాగునీటి పారుదల శాఖ చేపట్టింది. మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలోనూ మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దీనిపై సమీక్షించారు.

30 టీఎంసీలు నీటిని తరలించేలా..

శ్రీశైలం నుంచి సొరంగమార్గం ద్వారా (గ్రావిటీ) నల్లగొండ జిల్లాకు సాగు, తాగు నీరు అందించేందుకు 2005లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆమోదంతో ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు మొదలైంది. 30 టీఎంసీల నీటిని తరలించేందుకు రూ.2,813 కోట్లతో చేపట్టిన ఈ ప్రాజెక్టు పనులు మొదట్లో వేగంగా సాగినా, ఆ తరువాత వివిధ కారణాలతో ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కి అన్న చందంగా మారాయి. టీబీఎం బేరింగ్, ఇతర పరికరాలు పాడైపోవడంతో 2023లోనే పనులు ఆగిపోయాయి. ఆ తరువాత దానిని పట్టించుకున్న దాఖలాలు లేవు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దానిపై ప్రత్యేక దృష్టి సారించింది. అవసరమైన నిధులు దాదాపు రూ.2200 కోట్లు గ్రీన్ ఛానెల్ ద్వారా ఇచ్చేందుకు చర్యలు చేపట్టింది.

మిగిలింది 9.56 కిలోమీటర్లు

శ్రీశైలం రిజర్వాయర్ నుంచి నాగర్‌కర్నూల్ జిల్లా మన్నేవారిపల్లి వరకు 43.930 కిలోమీటర్ల పొడవునా సొరంగాన్ని 10 మీటర్ల డయాతో (వెడల్పు) తవ్వేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. శ్రీశైలం వద్ద నీటిని తీసుకునే ఇన్‌లెట్ నుంచి, మన్నేవారిపల్లి ఔట్ లెట్ నుంచి రెండు వైపులా సొరంగం తవ్వకం పనులను చేపట్టారు. రెండువైపులా కలిపి 34.37 కిలోమీటర్లు టన్నెల్ తవ్వకం పూర్తికాగా, ఇంకా 9.56 కిలోమీటర్లు తవ్వాల్సి ఉంది. అందులో ఔట్ లెట్ నుంచి ఇప్పటివరకు 20.435 కిలోమీటర్ల పొడవునా సొరంగం తవ్వకం పనులు పూర్తి కాగా, మరో 3.545 కిలోమీటర్లు తవ్వాల్సి ఉంది. అయితే అక్కడ రాయి గట్టిదనం ఎక్కువగా ఉన్నందున తరచూ బేరింగ్, ఇతర పరికరాలు దెబ్బతింటున్నాయి. ఇప్పటికి మూడు సార్లు బేరింగ్ పాడైపోయింది. ఇక ఇన్‌లెట్‌లో 13.935 కిలోమీటర్ల పొడవునా టన్నెల్ తవ్వకం పూర్తి కాగా, మరో 6.015 కిలోమీటర్లు తవ్వాల్సి ఉంది. అక్కడ సీపేజీ వస్తుండటంతో డీవాటరింగ్ ప్రక్రియను చేపట్టారు.

నెలాఖరుకు చెన్నై పోర్టుకు బేరింగ్..

ఎనిమిది మీటర్ల వ్యాసంతో 37 టన్నుల బరువు ఉండే టీబీఎం బేరింగ్, ఇతర స్పేర్ పార్ట్స్‌ను అమెరికా ఓహియోలోని రాబిన్స్ కంపెనీ సిద్ధం చేసి ఇండియాకు ఎగుమతి చేసింది. ప్రస్తుతం ఆ బేరింగ్, ఇతర పరికరాలు షిప్పింగ్‌లో ఉన్నాయి. ఈ నెలాఖరుకు అవన్నీ చెన్నై పోర్టుకు చేరనున్నాయి. అక్కడి నుంచి సొరంగం ఔట్‌లెట్ ప్రారంభమయ్యే మన్నెవారిపల్లికి ఫిబ్రవరి 15 నాటికి చేరేలా సాగునీటి పారుదల శాఖ ఏర్పాట్లు చేస్తోంది. అది వచ్చిన తరువాత సొరంగం లోపలికి బేరింగ్, ఇతర పరికరాలను తీసుకెళ్లి, టీబీఎంకు బిగించేందుకు దాదాపు రెండు నెలల సమయం పట్టే అవకాశం ఉంది. అంటే ఏప్రిల్ నెలాఖరుకు టీబీఎంను పూర్తి స్థాయిలో సిద్ధం చేసి సొరంగం తవ్వకం పనులను ప్రారంభించేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

2027 సెప్టెంబర్ నాటికి పూర్తిచేస్తాం

టన్నెల్ ఇన్‌లెట్‌లో సీపేజీని పూర్తిగా అరికట్టే ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోంది. ఇక బేరింగ్ రాగానే ఔట్‌లెట్‌లో టీబీఎంకు బేరింగ్‌ను బిగించి పనులను ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. మొత్తానికి ఈ పనులన్నీ 2027 సెప్టెంబర్ నాటికి పూర్తి చేసే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం.

– చక్రపాణి, ఎస్ఎల్‌బీసీ టన్నెల్ డీఈ

ఆపరేషన్ చబుత్ర విజయవంతం

జిల్లా వ్యాప్తంగా 246 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు

- భద్రతను స్వయంగా పర్యవేక్షించిన ఎస్పీ
- రోడ్డుపై కనిపించని పోకిరీలు, మందుబాబులు
- ప్రశాంతంగా నూతన సంవత్సర వేడుకలు



31న రాత్రి భద్రతను పర్యవేక్షిస్తూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీని పరిశీలిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర

నల్లగొండ క్రైం : నూతన సంవత్సర వేడుకలను జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా నిర్వహించేందుకు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ చేపట్టిన ఆపరేషన్ చబుత్ర విజయవంతమైంది. గతంలో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా జిల్లాలోని ముఖ్య పట్టణాలతోపాటు రాష్ట్ర, జాతీయ రహదారుల్లో రోడ్డు ప్రమాదాలు విషాదఛాయలు నింపాయి. ‘యాక్సిడెంట్ ఫ్రీ -ఇన్సిడెంట్ ఫ్రీ’ లక్ష్యంతో 2024 డిసెంబర్ 31వ తేదీన రాత్రి 10 గంటల నుంచి 2 గంటల వరకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించడంతో పాటు రోడ్లపై తిరిగే వారిని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిని పట్టుకుని కౌన్సిలింగ్ ఇచ్చారు. వాహనాలు సీజ్ చేయడం, డ్రంక్ అండ్‌డ్రైవ్ కేసులు నమోదు చేయడంతో 31న రాత్రి జిల్లా వ్యాప్తంగా ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోలేదు. నల్లగొండలో భద్రతను ఎస్పీనే స్వయంగా పర్యవేక్షించడంతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేయించారు. అంతకు రెండు రోజుల ముందు నుంచే పోలీస్ శాఖ చేపట్టిన తనిఖీల కారణంగా మందుబాబులు బహిరంగ ప్రదేశాల్లో, ఇతర వ్యవసాయ క్షేత్రాల్లో మందు, విందు పార్టీలు చేసుకోకుండా పోలీసులు కట్టడి చేశారు. పోలీసులు తనిఖీలతో అప్రమత్తమైన మందుబాబులు, పోకిరీలు రోడ్లపై కనిపించలేదు.

31న 246 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు..

2024 డిసెంబర్ 31న అర్ధరాత్రి జిల్లా వ్యాప్తంగా 246 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. మద్యం తాగి పట్టుబడిన వారందర్ని గురువారం కోర్టులో హాజరు పరచనున్నారు. అత్యధికంగా నల్లగొండ ట్రాఫిక్ పోలీసులు 39 కేసులు నమోదు చేయగా మిర్యాలగూడలో 22, నకిరేకల్‌లో 19, నల్లగొండ రూరల్‌లో 17, నల్లగొండ టూటౌన్‌లో 13, నార్కట్‌పల్లి, వాడపల్లి, అడవిదేవులపల్లి పోలీస్‌స్టేషన్లలో 10 చొప్పున, కొండమల్లేపల్లి, నిడమనూరు, చందంపేట, నేరడుగొమ్ము స్టేషన్లలో రెండు చొప్పున కేసులు నమోదు చేశారు.

29, 30 తేదీల్లో 128 కేసులు..

పోలీస్ శాఖ ముందు జాగ్రత్త చర్యగా 2024 డిసెంబర్ 29, 30 తేదీల్లో చేపట్టిన తనిఖీల్లో 128 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. జిల్లా కేంద్రంలోని ట్రాఫిక్ ట్రైనింగ్ సెంటర్‌లో వారితోపాటు కుటుంబ సభ్యులకు మద్యం తాగి వాహనాలు నడిపితే జరిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. పట్టుబడిన వారికి కోర్టు రూ.1లక్షా 19 వేలు జరిమానా విధించింది. 62 పెట్టి కేసుల్లో 54 మందికి రూ.56 వేలు జరిమానా విధించగా, ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారికి రూ.3,51,000 జరిమానా విధించింది.



రూ.30 కోట్ల మద్యం తాగారు..

జిల్లాలో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా 2024 డిసెంబర్ 30, 31 తేదీల్లో మందుబాబులు రూ.30 కోట్లు మద్యం తాగారు. డిసెంబర్ 2023న 30, 31 తేదీల్లో రూ.26 కోట్లు మద్యం తాగగా.. ఈసారి రూ.4 కోట్ల మద్యం అదనంగా తాగేశారు. ప్రతి నెల సాధారణంగా రూ.140 కోట్ల మద్యం అమ్మకాలు జరుగుతుంటాయి. డిసెంబర్‌లో మాత్రం అమ్మకాలు ఎక్కువగా ఉంటాయి.

వేడుకలు ప్రశాంతంగా జరిగాయి



యాక్సిడెంట్ ఫ్రీ ఇన్సిడెంట్ ఫ్రీ లక్ష్యంగా చేసుకుని చేపట్టిన చర్యలు మంచి ఫలితాన్నిచ్చాయి. 31న అర్ధరాత్రి ఎలాంటి సంఘటనలు, ప్రమాదాలు జరగకుండా నూతన సంవత్సరంలోకి జిల్లా ప్రజలను సంతోషంగా జరుపుకునేలా చేశాం. నేనే స్వయంగా జిల్లా కేంద్రంలో భద్రతను, తనిఖీలను పర్యవేక్షించాను. జిల్లా వ్యాప్తంగా సిబ్బందిని అప్రమత్తం చేశాను.

– శరత్‌చంద్ర పవార్, ఎస్పీ

చెర్వుగట్టులో కలెక్టర్ దంపతుల పూజలు



పూజల్లో పాల్గొన్న కలెక్టర్ దంపతులు

నార్కట్‌పల్లి : నూతన సంవత్సరం సందర్భంగా చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఆలయంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటీ, ఎలక్ట్రానిక్ అండ్ కమ్యునికేషన్ శాఖ డిప్యూటీ సెక్రటరీ భవేష్‌మిశ్రా దంపతులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు, దేవాలయ ప్రధాన అర్చకులు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, సురేష్ శర్మ, సతీష్‌శర్మ, శ్రీకాంత్ శర్మ వేద మంత్రాలతో పూజలు నిర్వహించి ఆశీర్వచనం చేశారు. ఈఓ సిరికొండ నవీన్‌కుమార్ కలెక్టర్ దంపతులను సన్మానించారు.

పూజల్లో పాల్గొన్న జడ్జీలు..

నూతన సంవత్సరం సందర్భంగా చెర్వుగట్టు ఆలయంలో జిల్లా సబ్ జడ్జి దీప్తి, సీనియర్ సివిల్ జడ్జి తేజకార్తిక్ ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వారికి ఆశీర్వచనం చేశారు. జడ్జీలను ఈఓ సన్మానించారు.

రేపు ఎన్జీ కళాశాలలో జాబ్ మేళా

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ ఎన్జీ కళాశాలలో 3వ తేదీన టీఎస్‌కేసీ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నటు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఉపేందర్, టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.అనిల్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్ఎన్ ల్యాబోరేటరీ లిమిటెడ్ పాల్గొంటున్న ఈ జాబ్‌మేళాకు 2024లో బీఎస్సీ కెమిస్ట్రీ పూర్తి చేసిన, ప్రస్తుతం బీఎస్సీ ఫైనల్ ఇయర్ చదువుతున్న బాలురు అర్హులని పేర్కొన్నారు.

సంకెళ్లతో సమగ్రశిక్షా ఉద్యోగుల నిరసన



సంకెళ్లతో నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

నల్లగొండ : రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ సమగ్రశిక్షా ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె బుధవారం 23వ రోజు కొనసాగింది. ఉద్యోగులు సంకెళ్లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రభుత్వం పే స్కేల్ అమలు చేస్తూ విద్యా శాఖలో విలీనం చేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. వారికి టీయూపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇరుగు శ్రీరాములు, బత్తిని భాస్కర్, పాపిరెడ్డి, మిర్యాల మురళి, శ్రీనివాస్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మొల్గూరి కృష్ణ, బొమ్మగాని రాజు, కంచర్ల మహేందర్, క్రాంతికుమార్, కొండ చంద్రశేఖర్, ఎం.నీలాంబరి, గుమ్మల మంజులారెడ్డి, వి.సావిత్రి, పుష్పలత పాల్గొన్నారు.

మానవ తప్పిదాల వల్లే రోడ్డు ప్రమాదాలు

నల్లగొండ రూరల్ : మానవ తప్పిదాల వల్లే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ డాక్టర్ ఎస్.వాణి అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా బుధవారం నల్లగొండ ఆర్టీసీలో 31వ తేదీ వరకు నిర్వహించే మాసోత్సవాలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. వాహనం నడిపేటప్పుడు పూర్తి ఏకాగ్రతతో , ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకుంటామన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, అతివేగం, త్వరగా గమ్యస్థానాలకు చేరాలనే ఆతృత, మద్యం తాగి, సరైన నిద్ర లేకపోవడం వల్ల ఎక్కువగా 25 నుంచి 40 ఏళ్ల మధ్య వయసు వారు మృతి చెందుతున్నట్లు తెలిపారు. ఆర్టీసీపై నేటికీ ప్రజల్లో భరోసా చెక్కు చెదర లేదన్నారు. అనంతరం ఉద్యోగులందరితో భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. ఆర్ఎం జానిరెడ్డి మాట్లాడుతూ డ్రైవర్ చేతిలోనే ప్రయాణికుల జీవితాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎంపీఏ వీరస్వామి, లావణ్య, కొండయ్య, మల్లికార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏడు నెలలుగా వేతనాల్లేవ్!

- మెప్మా ఆర్పీలకు అందని జీతాలు
- ఆర్థిక ఇబ్బందుల్లో కుటుంబాలు
- నెలనెలా అందించాలని వేడుకోలు
- జిల్లాలో 224 మంది ఆర్పీలు



అధికారులను కలిసేందుకు మెప్మా కార్యాలయం వద్ద వేచిఉన్న ఆర్పీలు

నల్లగొండ టూటౌన్: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ఆర్పీ(రిసోర్స్ పర్సన్)లకు ఏడు నెలలుగా వేతనాలు అందడం లేదు. గత జూన్ నెల నుంచి డిసెంబర్ వరకు వేతనాలు ఇంతవరకు ఇవ్వకపోవడంతో తమ కుటుంబాలు గడవక ఆర్పీలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. నెలకు రూ.6వేలే ఇస్తున్నప్పటికీ ప్రతినెలా ఇవ్వడం లేదని ఆర్పీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎనిమిది మున్సిపాలిటీల్లో..

జిల్లాలోని నల్లగొండ, మిర్యాలగూడ, దేవరకొండ, హాలియా, నందికొండ, చండూరు, చిట్యాల, నకిరేకల్ మున్సిపాలిటీల్లో మెప్మా పరిధిలో 224 మంది ఆర్పీలు పని చేస్తున్నారు. వీరంతా ఆయా మున్సిపాలిటీల్లో సమభావన సంఘాలకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి మహిళల ఉపాధి కోసం పాటుపడుతుంటారు. ఇప్పించిన రుణాలను తిరిగి నెలనెలా చెల్లించేలా మహిళలకు అవగాహన కల్పిస్తారు. అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. సర్వేలకు, పథకాల దరఖాస్తుల స్వీకరణకు స్థానికంగా ఉండే ఆర్పీలకే మున్సిపల్ అధికారులు విధులు అప్పగిస్తున్నారు. ఇన్ని పనులు చేయిస్తున్న ప్రభుత్వం వీరికి కనీస వేతనం ఇవ్వకపోగా ఇచ్చే చాలీచాలని వేతనాన్ని కూడా నెలనెలా ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. జీతాల గురించి అడిగితే తమను ఎక్కడ తొలగిస్తారనే భయంతో అధికారులను అడగలేకపోతున్నామని పలువురు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి తమకు నెలనెలా కనీస వేతనం అందించాలని ఆర్పీలు కోరుతున్నారు.

మున్సిపాలిటీ	ఆర్పీలు
నల్లగొండ	65
మిర్యాలగూడ	81
దేవరకొండ	18
చండూరు	10
చిట్యాల	09
హాలియా	13
నందికొండ	07
నకిరేకల్	21
మొత్తం	224

వారం రోజుల్లోగా వేతనాలు

జిల్లాలోని మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ఆర్పీల వివరాలను ఇప్పటికే ప్రభుత్వానికి పంపాం. వారం రోజుల్లోగా ప్రభుత్వం వేతనాలు విడుదల చేయనుంది. వెంటనే ఆర్పీల బ్యాంకు ఖాతాల్లో పడుతాయి.

– శివాజీ, మెప్మా ఉద్యోగి

ప్రతినెలా జీతం ఇవ్వాలి



ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా ఆర్పీలందరం ఎంతగానో కృషిచేస్తున్నాం. ఇస్తున్న వేతనం చాలా తక్కువ అయినప్పటికీ నెలనెలా ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ప్రతినెలా జీతాలు ఇచ్చి ఆదుకోవాలి.

– జ్యోతి, ఆర్పీ, నల్లగొండ

ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం



మున్సిపాలిటీలో మీటింగ్ ఉందంటే వెంటనే కార్యాలయానికి వస్తాం. వచ్చిపోయేందుకు ఆటో చార్జీలు అవుతున్నాయి. ఇంట్లో పనులు వదిలి పెట్టి పని చేస్తున్నా నెలల పాటు జీతాలు రావడంలేదు. ప్రభుత్వం మాకు ఉద్యోగ భద్రత కల్పించాలి.

– నాగలక్ష్మి, ఆర్పీ నల్లగొండ

వేతనాలు పెంచాలి



ప్రభుత్వం ఏ పని అప్పగిస్తున్నా చేస్తున్నాం. సంక్షేమ పథకాల అమలు కోసం వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి సర్వేలు చేస్తున్నాం. ఆర్పీల వేతనాలు పెంచేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. బకాయి వేతనాలు వెంటనే విడుదల చేయాలి.

– సీహెచ్.జ్యోతి, ఆర్పీ, నల్లగొండ

క్లుప్తంగా

గుర్తుతెలియని వ్యక్తి మృతి

గరిడేపల్లి: మండల పరిధిలోని అప్పన్నపేట గ్రామంలో భిక్షాటన చేసుకుంటూ జీవిస్తున్న గుర్తుతెలియని వ్యక్తి అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. బుధవారం ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం .. అప్పన్నపేట గ్రామంలో మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి అనారోగ్యంతో ఒక్కసారిగా కిందపడిపోవడంతో స్థానికులు 108 వాహనంలో ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి వయస్సు సుమారు 45 నుంచి 50 ఏళ్లు ఉంటాయని, మృతుడి గురించిన వివరాలు తెలిసిన వారు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ సూచించారు.

కానిస్టేబుల్, హోంగార్డు మధ్య ఘర్షణ

- కానిస్టేబుల్ సస్పెన్షన్
- ఎస్పీ కార్యాలయానికి హోంగార్డు అటాచ్

పెన్‌పహాడ్: డబ్బుల విషయమై పోలీస్ స్టేషన్‌లో ఘర్షణకు దిగిన కానిస్టేబుల్, హోంగార్డుపై సూర్యాపేట జిల్లా ఎస్పీ కఠిన చర్యలు తీసుకున్నారు. పెన్‌పహాడ్ ఎస్‌ఐ గోపికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. పెన్‌పహాడ్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న ఓ టీస్టాల్ యజమాని క్రిస్మస్ పండుగ సందర్భంగా కానిస్టేబుల్ జాటోతు రవికుమార్, హోంగార్డు గంజి శ్రీనుకు దావత్ చేసుకోవడం కోసం రూ. 1500 ఇచ్చాడు. ఈ డబ్బుల విషయమై డిసెంబర్ 28న కానిస్టేబుల్, హోంగార్డు పోలీస్ స్టేషన్‌లో ఘర్షణ పడ్డారు. ఈ విషయాన్ని ఎస్‌ఐ గోపికృష్ణ ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్‌కు దృష్టికి తీసుకెళ్లగా.. కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేయడంతో పాటు హోంగార్డును ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

చౌటుప్పల్: విజయవాడ-హైదరాబాద్ హైవేపై చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులకు గాయాలయ్యాయి. నార్కట్‌పల్లి మండలం భాగ్యగూడెం గ్రామానికి చెందిన వంగాల అఖిల్, వంగాల రాముతో పాటు అడ్డగూడూరు మండలం కోటమర్తి గ్రామానికి చెందిన చింత ఉపేందర్ యాక్టీవాపై హైదరాబాద్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో చౌటుప్పల్ పట్టణంలోని తంగడపల్లి చౌరస్తా వద్ద అదుపుతప్పి కిందపడిపోయారు. తీవ్రంగా గాయపడిన ముగ్గురిని చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. తాము ముందు వెళ్తుండగా వెనుక వైపు నుంచి ఓ లారీ ఢీకొట్టిందని క్షతగాత్రులు పోలీసులకు తెలిపారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఇంట్లో దొంగతనం

- 8 తులాల బంగారం, 20 తులాల వెండి, రూ.1,50,000 నగదు ఎత్తుకెళ్లిన దుండగులు

చింతపల్లి: గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి వృద్ధురాలిపై దాడి చేసి బంగారం, వెండి, నగదు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన చింతపల్లి మండలం రాజ్యానాయక్ తండాలో జరిగింది. ఎస్‌ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. రాజ్యానాయక్ తండాకు చెందిన వృద్ధురాలు వర్త్య ముత్యాలు ఇంట్లో నిద్రిస్తుండగా బుధవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి ఆమెపై దాడి చేసి పుస్తెలతాడు, బీరువాలో ఉన్న 8 తులాల బంగారం, 20 తులాల వెండి, రూ.1,50,000 ఎత్తుకెళ్లారు. దేవరకొండ ఏఎస్పీ మౌనిక, నల్లగొండ క్లూస్ టీం ఇంటిని పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సీఎం కప్ ఖోఖోలో నల్లగొండకు ద్వితీయస్థానం

వరంగల్: సీఎం కప్ క్రీడా పోటీల్లో భాగంగా వరంగల్ జిల్లా కేంద్రంలో బుధవారం జరిగిన ఖోఖో పోటీల్లో(మహిళలు) నల్లగొండ జట్టు ద్వితీయ స్థానం పొందింది. ఆసిఫాబాద్ జిల్లా మొదటి స్థానం, హైదరాబాద్ జిల్లా తృతీయ, రంగారెడ్డి జిల్లా నాలుగో స్థానాలను కైవసం చేసుకున్నట్లు డీవైఎస్‌ఓ సత్యవాణి తెలిపారు.

భూతగాదాలతో వ్యక్తి దారుణ హత్య

- కత్తితో పొడిచి, గొంతు కోసిన మృతుడి బాబాయ్ కుమారుడు
- నిందితుడితో పాటు మరో ఆరుగురిపై కేసు నమోదు



శేషు (ఫైల్)

చివ్వెంల(సూర్యాపేట): భూతగాదాల నేపథ్యంలో వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన చివ్వెంల మండలం లక్ష్మణ్‌నాయక్‌తండాలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మణ్‌నాయక్ తండాకు చెందిన ధరావతు లక్ష్మణ్, ధరావతు శ్రీను, ధరావతు వెంకన్న సొంత అన్నదమ్ములు. ముగ్గురు అన్నదమ్ముల మధ్య 2017 సంవత్సరం నుంచి భూతగాదాలు నడుస్తున్నాయి. ఈ క్రమంలో పలుమార్లు గొడవ పడి పోలీస్ స్టేషన్‌లో ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకున్నారు. పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీలు కూడా చేసుకున్నారు. ధరావతు లక్ష్మణ్ చిన్న కుమారుడు శేషు(35) వ్యవసాయం చేయడంతో పాటు సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌లో అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శేషు మంగళవారం విధులు ముగించుకుని రాత్రి



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న చివ్వెంల సీఐ, ఎస్‌ఐ

12 గంటల సమయంలో ఇంటికి బైక్‌పై వస్తుండగా.. లక్ష్మణ్‌నాయక్ తండా శివారులో ఎస్సారెస్పీ కాలువ పక్కన శేషు బాబాయ్ ధరావతు వెంకన్న కుమారుడు ధరావతు దీపక్‌తో పాటు అతడి స్నేహితులు ధరావతు రాజేష్, ధరావతు సురేష్, జర్పుల ప్రవీణ్ నూతన సంవత్సరం సందర్భంగా కేక్ కట్ చేసి కేకలు వేస్తున్నారు. ఇది గమనించిన శేషు వారి వద్దకు వెళ్లి తమ తండాకు చెందిన వారే అని నిర్ధారించుకుని అక్కడ నుంచి ఇంటికి వెళ్తుండగా.. భూతగాదాల కారణంగా ఎప్పటి నుంచో శేషును అంతమొందించాలని చూస్తున్న దీపక్ అతడిని అడ్డుకుని గొడవపడ్డాడు. ఈ క్రమంలో దీపక్ తన స్కూటీలో ఉన్న కత్తి తీసి శేషు కడుపులో పొడిచాడు. శేషు అక్కడి నుంచి తప్పించుకుని తండాలో ఉన్న వాంకుడోతు రంగా ఇంటి పక్కన ఉన్న గుడిసెలో దాక్కున్నాడు. శేషును వెంబడిస్తూ దీపక్ తన తల్లిదండ్రులు ధరావతు వెంకన్న, సుజాతకు ఫోన్ చేశాడు. వారు కూడా గుడిసె వద్దకు చేరుకుని శేషు గొంతు గోసి, మర్మాంగాలు పిసికి చంపారు. అప్పటికే శేషు కోసం అక్కడికి వచ్చిన అతడి భార్య లలితను చూసి ముగ్గురూ అక్కడ నుంచి పరారయ్యారు. రాజేష్, సురేష్, ప్రవీణ్ తమకు ఇళ్లకు వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ వి. మహేశ్వర్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి బాబాయ్ ధరావతు శ్రీను ప్రోత్సాహంతోనే తన భర్తను ధరావతు దీపక్, అతడి తల్లిదండ్రులు ధరావతు వెంకన్న, సుజాత హత్య చేశారని, వారికి దీపక్ స్నేహితులు రాజేష్, సురేష్, ప్రవీణ్ సహకరించారని మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ధరావతు శ్రీను, ధరావతు వెంకన్న, సుజాత, దీపక్‌తో పాటు రాజేష్, సురేష్, ప్రవీణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజశేఖర్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌కు తరలించారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

మహాశివరాత్రి జాతర ఘనంగా నిర్వహించాలి

- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మేళ్లచెరువు: మండల కేంద్రంలోని ఇష్టకామేశ్వరీ సమేత స్వయంభు శంభులింగేశ్వరస్వామి దేవాలయంలో మహాశివరాత్రి జాతరను గతంలో కంటే ఘనంగా నిర్వహించాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మహాశివరాత్రి జాతర ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో హుజూర్‌నగర్ నియోజకవర్గంలో వందల కోట్ల రూపాయలతో అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మండలంలో ప్రతి ఎకరానికి సాగునీరు అందించేందుకు కృషిచేశానన్నారు. కొత్త లిఫ్టు పనులకు సంబంధించి భూములు కోల్పోయిన వారికి అధిక ధర ఇప్పిస్తామన్నారు. హుజూర్‌నగర్‌లో డిగ్రీ కాలేజీ నూతన భవన నిర్మాణానికి రూ.4.15 కోట్లు, ఇంటర్ కాలేజీ భవన నిర్మాణానికి రూ.7.5 కోట్లు అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌కు రూ.40 కోట్లు మంజూరు చేయించానని వివరించారు. గుండ్లపల్లి లిఫ్టు ఇరిగేషన్ పనిచేయడం లేదని రైతులు మంత్రి దృష్టికి తీసుకురాగా.. మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కందిబండ వద్ద కోదాడ-మేళ్లచెరువు రోడ్డుపై ఉన్న బ్రిడ్జి కూలిపోయిన విషయాన్ని తన దృష్టి తీసుకురాలేదని.. ఫిబ్రవరిలో జరిగే మహాశివరాత్రి జాతర సమయానికి బ్రిడ్జి ఏర్పాటు చేసే పనులు పూర్తిచేయాలని ఆర్డీఓ శ్రీనివాసులును ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జ్యోతి, దేవాలయ చైర్మన్ శంభిరెడ్డి, ఈఓ కొండారెడ్డి, భాస్కరరెడ్డి, సైదేశ్వరరావు, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నృసింహుడి సన్నిధిలో ప్రత్యేక దర్శనానికి ఏర్పాట్లు

- ఆలయ తూర్పు ద్వారం ఎదుట అందుబాటులోకి గ్రిల్స్, బెంచీలు, కుర్చీలు



ఆలయ తూర్పు ద్వారం ముందు ఏర్పాటు చేసిన గ్రిల్స్

యాదగిరిగుట్ట: యాదగిరి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి వచ్చే దివ్యాంగులు, వృద్ధులు, చంటి పిల్లల తల్లులకు ప్రత్యేక దర్శనం కల్పించేందుకుగాను ఈఓ భాస్కర్‌రావు ప్రత్యేక ఏర్పాట్లు చేయించారు. ఆలయ తూర్పు ద్వారం ముందు సుమారు ఏడడుగుల గేట్‌తో కూడిన గ్రిల్స్ ఏర్పాటు చేసి అక్కడ దివ్యాంగులు, వృద్ధులు, చంటి పిల్లల తల్లులు కూర్చోవడానికి బెంచీలు, కుర్చీలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రతిరోజు ఉదయం 11 గంటల నుంచి 11.30గంటల మధ్యలో, సాయంత్రం 5గంటల నుంచి 5.30గంటల మధ్యలో వీరికి క్యూలైన్‌లో తీసుకెళ్లి ప్రత్యేక దర్శనం కల్పిస్తామని ఇప్పటికే ఈఓ భాస్కర్‌రావు ప్రకటించారు.

ప్రముఖుల పూజలు..

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని రోడ్లు, భవనాల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్‌రాజ్, ఐఏఎస్ అధికారి గౌతమ్, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ బుధవారం వేర్వేరుగా దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారికి సంప్రదాయంగా స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వారికి వేద ఆశీర్వచనం చేయగా, ఈఓ, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య



శివరాం (ఫైల్)

రామన్నపేట: కోళ్ల షెడ్డులో ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన రామన్నపేట మండలం దుబ్బాక గ్రామ శివారులో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. రామన్నపేట మండలం కొమ్మాయిగూడెం గ్రామానికి చెందిన కొండగడప శ్రీనివాస్‌కు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు శివరాం (21) రెండు సంవత్సరాలుగా దుబ్బాక గ్రామానికి చెందిన బత్తుల రమేష్ కోళ్లఫారంలో పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి నూతన సంవత్సరం సందర్భంగా కోళ్లఫారం యజమాని బత్తుల రమేష్‌తో పాటు బండారి రాములు, బత్తుల భిక్షమయ్యతో కలిసి శివరాం మద్యం సేవించాడు. రాత్రి 11గంటల సమయంలో బండారి రాములును మునిపంపులలో అతడి ఇంటి వద్ద దింపి రావడానికి శివరాం బైక్‌పై వెళ్లాడు. అర్ధరాత్రి 12గంటల సమయంలో కోళ్లఫారం యజమాని రమేష్ శివరాంకు ఫోన్‌చేయగా తర్వాత వస్తానని చెప్పడంతో వారు పడుకున్నారు. బుధవారం తెల్లవారుజామున 4గంటల సమయంలో కోడిపిల్లలకు నీళ్లు పెట్టడం కోసం కోళ్లఫారం యజమాని బత్తుల రమేష్ నిద్ర లేవగా.. కోళ్ల షెడ్డులో శివరాం ఉరేసుకుని కనిపించాడు. బత్తుల రమేష్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గుండాల నర్సింహకు విషయం తెలుపగా అతడు శివరాం తండ్రికి సమాచారం ఇచ్చాడు. తన కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నాయని, ఫోన్‌కాల్ డేటా వాట్సాప్ డేటా ఆధారంగా విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని మృతుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పి. మల్లయ్య తెలిపారు.

16 మంది ప్రభుత్వ ఉపాధ్యాయుల డిస్మిస్

- ఉత్తర్వులు జారీ చేసిన యాదాద్రి భువనగిరి జిల్లా డీఈఓ
- గత కొన్నేళ్లుగా విధులకు హాజరుకాకపోవడంతో చర్యలు

భువనగిరి: గత కొద్ది సంవత్సరాల నుంచి విధులకు హాజరుకాని ప్రభుత్వ ఉపాధ్యాయులను సర్వీస్ నుంచి తొలగిస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా డీఈఓ సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. సర్వీస్ నుంచి తొలగించబడిన వారిలో ఎన్. ఉమారాణి, బి. ప్రభాకర్‌రెడ్డి, అబ్దుల్ హమీద్ (2005), సీహెచ్. స్వప్న, జీ. మాధవి,(2006), ఎస్. నవీన్‌కుమార్ (2007), ఎం. ఉమాదేవి (2008), బి. క్రాంతికిరణ్ (2010), జే. ఉమాదేవి (2011), బి. గీతారాణి, ఏ. నర్సింహారావు (2012), ఎం. శైలజ (2013), సీహెచ్. భాగ్యలక్ష్మి, సీహెచ్. కిరణ్‌కుమారి(2016), వై. విజయలక్ష్మి (2021), కె. శ్రీనివాస్‌రెడ్డి (2022) ఉన్నారు. వీరిలో 15 మంది ఎస్జీటీలు ఉండగా.. గీతారాణి స్కూల్ అసిస్టెంట్‌గా ఉన్నారు. వీరు విధులకు హాజరుకాకపోడంతో జిల్లా విద్యాశాఖ నుంచి ఐదు విడుతలుగా నోటీసులు జారీ చేశారు. నోటీసులకు వారి నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో అధికారులు గెజిట్ నోటిఫికేషన్ ప్రకటించారు. అప్పటికి స్పందించకపోవడంతో వారిని సర్వీస్ నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

జిల్లా పునర్విభజనకు ముందు నుంచి..

2016లో రాష్ట్రంలో జిల్లాల పునర్విభజన జరిగింది. సర్వీస్ నుంచి తొలగించబడిన టీచర్లలో జిల్లాల పునర్విభజనకు ముందు నుంచి హాజరుకాని వారు 14 మంది ఉన్నారు. జిల్లా పునర్విభజన అనంతరం ఇద్దరు జీఓ నంబర్ 317 ద్వారా యాదాద్రి భువనగిరి జిల్లాకు వచ్చారు.

దళితుడిని చితకబాదిన పోలీసులు

- ఇంటి ముందు మద్యం తాగొద్దని చెప్పినా వినకపోవడంతో పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ వివరణ


నూతనకల్: దళితుడిని పోలీసులు విచక్షణారహితంగా చితకబాదిన ఘటన నూతనకల్ మండల కేంద్రంలో మంగళవారం రాత్రి జరిగింది. బుధవారం బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. నూతనకల్ మండల కేంద్రానికి చెందిన కాటూరి రాము నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా మంగళవారం రాత్రి తన ఇంటి ముందు కూర్చొని మిత్రులతో కలిసి మద్యం సేవిస్తుండగా.. పెట్రోలింగ్ పోలీసులు వచ్చి వారిని ఇంట్లోకి వెళ్లమని కోరారు. ఇల్లు తమదే అని, ఎవరికీ ఇబ్బంది కల్గించమని కాటూరి రాము పోలీసులకు తెలిపాడు. దీంతో పోలీసులకు, రాము మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో పెట్రోలింగ్ పోలీసులు ఫోన్ ద్వారా ఎస్‌ఐకు సమాచారం ఇవ్వగా.. ఎస్‌ఐ వచ్చి తనను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి 15నిమిషాల పాటు విచక్షణారహితంగా కొట్టి రాత్రంతా స్టేషన్‌లోనే ఉంచారని రాము తెలిపాడు. గ్రామానికి చెందిన పెద్దమనుషులు వచ్చి జామీను మీద విడిచి పెట్టమని అడిగినప్పటికీ వదిలిపెట్టలేదని, కనీసం తాగడానికి మంచినీరు కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశాడు.



పోలీసులు కొట్టిన దెబ్బలను చూపుతున్న రాము

ఈ విషయమై ఎస్‌ఐ మహేంద్రనాథ్‌ను వివరణ కోరగా.. పెట్రోలింగ్‌కు వెళ్లిన ఇద్దరు కానిస్టేబుళ్లపై మద్యం మత్తులో రాము, అతడి స్నేహితులు వాగ్వాదానికి దిగారని, అక్కడికి వెళ్లిన తనపై కూడా దౌర్జన్యం చేయడానికి ప్రయత్నించడంతో పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లామని చెప్పారు. పోలీస్ స్టేషన్‌లో కూడా కానిస్టేబుళ్లపై రాము చేయి చేసుకున్నాడని ఎస్‌ఐ పేర్కొన్నారు.

నూతన సంవత్సర జోష్



భువనగిరి ఖిలాపై సందర్శకుల సందడి



స్వర్ణగిరి ఆలయంలో బారులుదీరిన భక్తులు

భువనగిరి: నూతన సంవత్సరం మొదటి రోజు భువనగిరి పట్టణ శివారులోని స్వర్ణగిరి వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది, స్వామివారి దర్శనం కోసం క్యూలైన్లలో భక్తులు బారులుదీరారు. అదేవిధంగా భువనగిరి ఖిలాపై ఉదయం నుంచి సాయంత్రం వరకు సందర్శకులతో సందడి వాతావరణం నెలకొంది. జనగామ జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ ఖిలాను సందర్శించారు. పట్టణంలోని శ్రీరేణుకా ఎల్లమ్మ దేవాలయం, ఖిలా కింద సీతారామాంజనేయస్వామి దేవాలయం, సాయిబాబా ఆలయంలో ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. కేకులు కట్ చేసి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. యాదగిరిగుట్ట, స్వర్ణగిరి ఆలయాలకు వచ్చిన భక్తులతో ఆర్టీసీ బస్టాండ్‌లో రద్దీ నెలకొంది.

మంచు దుప్పటి

నేరేడుచర్ల మున్సిపాలిటీలో బుధవారం ఉదయం వేళ దట్టమైన మంచు కమ్ముకుంది. దీంతో స్థానికంగా ఉన్న కోదండ రామాలయంపై మంచు దుప్పటి కప్పుకున్నట్లు కనిపించింది. అదే విధంగా కోదాడ-జడ్చర్ల హైవే, నేరేడుచర్ల-జాన్‌పహాడ్ రోడ్డుపై ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

– నేరేడుచర్ల



మంచులో కోదండరామాలయం

ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి యువత ఎదగాలి

- కేంద్ర ప్రభుత్వ ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ చైర్మన్ మనోజ్‌కుమార్



చిటికి కట్టే విధానాన్ని పరిశీలిస్తున్న మనోజ్‌కుమార్

భూదాన్‌పోచంపల్లి: దేశంలోని యువత ఉద్యోగాలు చేయడం కాదు, ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలన్నదే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన ఆత్మనిర్భర్ అభియాన్ ముఖ్య ఉద్దేశమని కేంద్ర సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖలోని ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ చైర్మన్ మనోజ్‌కుమార్ అన్నారు. బుధవారం భూదాన్‌పోచంపల్లిలో కేంద్ర సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ సహకారంతో ఏర్పాటు చేసిన కళాపునర్వి హ్యాండ్లూమ్‌ను ఆయన సందర్శించారు. అక్కడ రీలింగ్ యూనిట్, చిటికి కట్టే విధానం, రంగులద్దకం, మగ్గాలపై తయారవుతున్న ఇక్కత్ వస్త్రాలను పరిశీలించారు. కార్మికులతో మాట్లాడి నెలకు ఎంత ఆదాయం వస్తుందని అడిగి తెలుసుకున్నారు. అలాగే హ్యాండ్లూమ్ యూనిట్ నిర్వాహకులు సాయిని భరత్, భాస్కర్‌లు రూపొందించిన చేనేత వస్త్రాలను చూసి అబ్బురపడ్డారు. యూనిట్‌ను విజయవంతంగా నిర్వహిస్తూ, వందలాది కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న తీరును అభినందించారు. భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వం నుంచి ఆర్థిక సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ఓకల్ ఫర్ లోకల్ అనే నినాద స్ఫూర్తితో యువతలోని నైపుణ్యాలతో దేశం త్వరితగతిన అభివృద్ధి చెందుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో యువత స్వయం సమృద్ధి సాధించేందుకు ఖాదీ, అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ ద్వారా వ్యాపారస్థాపనకు రూ.50 లక్షల వరకు రుణాలు ఇస్తుందని, ఇందులో 35 శాతం సబ్సిడీ ఉంటుందని తెలిపారు. గత ఏడాది కేంద్ర ప్రభుత్వం లక్షా 56వేల కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయించి 10 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించిందని పేర్కొన్నారు. కాగా ఎంతో నైపుణ్యం, కళాత్మకమైన పోచంపల్లి ఇక్కత్‌డిజైన్లు ప్రింటింగ్ కాకుండా తమ శాఖ ద్వారా అధ్యయనం చేసి, అవసరమైతే ఏఐ టెక్నాలజీని జోడించి డూప్లికేషన్ అరికట్టేందుకు తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ జోనల్ డిప్యూటీ సీఈఓ మదన్ కుమార్, తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఎంఎస్ సుధాకర్, డిప్యూటీ డైరెక్టర్ మనోజ్, పీఎంఈజీపీ రాష్ట్ర నోడల్‌అధికారి నారాయణరావు, కళాపునర్వి హ్యాండ్లూమ్ యూనిట్ నిర్వాహకులు సాయిని భరత్, సాయిని భాస్కర్ పాల్గొన్నారు.

బత్తాయిలో పూత, పిందె రాలకుండా జాగ్రత్తలు



పూత దశలో ఉన్న బత్తాయి తోట (ఇన్‌సెట్‌లో) రాలిన బత్తాయి పిందెలు

గుర్రంపోడు: జిల్లాలోని బత్తాయి తోటలు ప్రస్తుతం పూత దశలో కళకళలాడుతున్నాయి. ప్రతి ఏడాది పూత, పిందె ఎక్కువగా రాలిపోయి సరైన దిగుబడులు రాక రైతులు నష్టపోతున్నారు. బత్తాయి తోటల్లో పూత, పిందె రాలకుండా రైతులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రాంతీయ ఉద్యానవనశాఖ అధికారి మురళి సూచిస్తున్నారు. బత్తాయి తోటల పెంపకంలో అవలంబించాల్సిన యాజమాన్య పద్ధతులు ఆయన మాటల్లోనే..

- బత్తాయి తోటలు పూత, పిందెలతో ఉన్నప్పుడు వేర్లు ఉన్న ప్రాంతాన్ని కదిలించరాదు. పాదులు తవ్వడం, దున్నడం ద్వారా వేర్లకు నష్టం కలిగించరాదు.
- పూత, పిందె దశల్లో క్రమపద్ధతిలో నీటి తడులివ్వాలి. బిందు సేద్యం ద్వారా ప్రస్తుత నెలలో కాపునిచ్చే తోటలకు రోజూ 150 లీటర్ల నీరు అందివ్వాలి. నీటి తడులు అందించడం ఎక్కువైనా, తక్కువైనా పూత, పిందె రాలుతుంది. పాదుల్లో ఎప్పుడూ గుగ్గిళ్ల పదును(చేతిలో మట్టిని పట్టుకుంటే ముద్ద కానిది) ఉండాలి.
- నీటి ఎద్దడితో పూత, పిందె ఎక్కువగా రాలిపోతుంది. ఆలస్యంగా నీటి తడులిస్తే అధిక వేడి వాతావరణంలో పూత, పిందె రాలుడు మార్చి, ఏప్రిల్ నెలాఖరు వరకు అవకాశం ఉంది. అందువల్ల ఈ నెలాఖరులోపే తోటలను నీటి తడులివ్వాలి. నీటి ఎద్దడి ఏర్పడకుండా డ్రిప్ ద్వారా క్రమపద్ధతిలో నీరు అందించాలి.
- పూత, పిందె రాలుడు అరికట్టడానికి 2-4డి హార్మోన్ మందు 10 పి.పి.ఎం అంటే ఒక గ్రాము మందును 100 లీటర్ల నీటిలో లేదా ప్లానోఫిక్స్ హార్మోన్ మందు 1 మిల్లీలీటరుకు 5 లీటర్ల నీటిలో కలిపి పూత సమయంలో ఒక మారు, పిందె గోలికాయ సైజు ఉన్నప్పుడు ఇంకోసారి పిచికారీ చేయాలి. ఈ హార్మోన్‌ల ఉత్ప్రేరకాలుగా పనిచేసి మొక్కల్లోని సుప్తావస్థను తొలగిస్తాయి. ఐతే హార్మోనులను నిర్ణీత మోతాదులోనే పిచికారీ చేయాలి. మోతాదు మించితే పూత, పిందె ఎక్కువగా రాలిపోవడమేగాక చెట్టు కూడా దెబ్బతింటుంది.
- హార్మోన్ల పిచికారీలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. మందులు మొతాదు మించితే పూత, పిందె ఎక్కువగా రాలే ప్రమాదం ఉంది.

- సూక్ష్మధాతు లోపాల నివారణకు జింక్ సల్ఫేట్ 5 గ్రా., మెగ్నిషియం సల్ఫేట్ 2 గ్రా., ఫెర్రస్ సల్ఫేట్ 2 గ్రా., మాంగనీస్ సల్ఫేట్ 2 గ్రా., బోరాక్స్ 1 గ్రా., సున్నం 6 గ్రా., యూరియా 10 గ్రా. ఒక లీటరను నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. సూక్ష్మధాతు లోపాలు నివారిస్తేనే ఆశించిన దిగుబడులు వస్తాయి. ఈ పోషకాలను విడివిడిగా కొనుగోలు చేయడం ఎక్కువ ఖరీదుగా భావించేవారు మార్కెట్‌లో లభిస్తున్న బ్రాండెడ్ కంపెనీల ఫార్ములా-4తో ఉన్న సూక్ష్మపోషకాలను పిచికారీ చేసుకోవచ్చు.

మంగు.. నివారణ చర్యలు

బత్తాయిలో కత్తెరతో పాటు ముందు సీజన్ పంట గోలికాయ సైజు నుంచి నిమ్మకాయ సైజులో ఉంది. ఈ కాయలకు మంగునల్లి ఎక్కువగా ఆశించి నష్టం కలిగిస్తుంది. కాయలపై నల్లపురుగులు కంటికి కనిపించనంత చిన్నవిగా ఉంటాయి. వీటిని భూతద్దంలో సులభంగా చూవడచ్చు. నల్లులు పిందెలు, కాయలపై పారాడుతూ తొక్కనుంచి రసం పీల్చి జీవిస్తాయి. రసాన్ని పీల్చే ప్రకియతో నల్లి నోటి నుంచి రసాయనాన్ని వదులుతుంది. ఈ రసాయనం కాయ తోలు నుంచి స్రవించిన ద్రవం సూర్యరశ్మికి మార్పు చెంది తుప్పు రంగుగా మారుతుంది. అందుకే బయటకు కనిపించే, సూర్యరశ్మి తగిలే కాయల్లో మంగు ఎక్కువగా కనిపిస్తుంది. ఎండలు ముదురుతున్న సమయంలో మంగు నల్లులు విజృంభిస్తాయి. పిందెలకు నల్లి ఆశిస్తే రంగు కోల్పోయి మంగు ఏర్పడమే కాక కాయ ఎదగదు. మంగునల్లి కాయలకు మార్కెట్‌లో ధర పలకదు.

నివారణ ఇలా..

- రైతులు భూతద్దం సహాయంతో నల్లి ఉనికిపై నిఘా పెట్టి ఉంచాలి. ఒకటి, రెండు నల్లులు తోటలో ఎక్కడైనా పిందె, కాయలపై గమనించగానే పిచికారీ చేయాలి.
- ప్రాథమిక క్షేత్ర ప్రదర్శనల్లోనూ, రైతు పరిశీలనలోనూ కొత్తగా వచ్చిన మందులు నల్లిని సమర్థవంతంగా అరికట్టినట్లు తేలింది. లీటరు నీటికి 2 మిల్లీ లీటర్ల ప్రాపర్‌గైట్ లేదా డైపెంథిరాన్ ఒక గ్రాము లీటరు నీటికి చొప్పున లేదా లీటర్ నీటికి 5 మిల్లీ లీటర్ల డైకోఫాల్ మందును మార్చుతూ పది రోజుల వ్యవధిలో రెండు, మూడు సార్లు పిచికారీ చేయాలి.
- పిందెలు గోలికాయ నుంచి నిమ్మపండు సైజులో ఉన్నప్పుడు లీటరు నీటికి 5 గ్రాములు సల్ఫేట్ ఆఫ్ పొటాష్‌ను లేదా మల్టికేను ఒకమారు పిచికారీ చేస్తే నల్లిని అణచివేయడంతో పాటు కాయ నాణ్యత పెరుగుతుంది.

పాడిపంట

- ఆకులు చుట్టుకుని ఉండే పురుగుల వల్ల కూడా పూత, పిందె రాలుతుంది. వీటి నివారణకు 2 మి.లీ. మిథైల్ డెమిటాన్ లేదా 2 మి.లీ. డైనుతోఝెట్ లీటర్ నీటీలో కలిపి లేత ఇగురు పూతపై పిచికారీ చేయాలి.
- తొడిమ కుళ్లు తెగులు వల్ల కూడా బఠాణీ గింజ సైజు నుంచి నిమ్మకాయ సైజు వరకు కాయలు రాలిపోతుంటాయి. కాయపై తొడిమ దగ్గర పసుపు రంగులోకి మారి రాలిపోతుంటే రెండు గ్రాముల కార్బండిజమ్ మందును ఒక లీటరు నీటికి, లేదా రెండు గ్రాముల మాంకోజెబ్ ఒక లీటరు నీటికి, ఒక గ్రాము రెడోమిల్ ఒక లీటరు నీటికి చొప్పున కలిపి నెల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.
- సూక్ష్మదాతు లోపాలతో చెట్లు పసుపు రంగులోకి మారి ఉంటే కూడా పూత, పిందె నిలబడదు. చలికాలంలో చలి తీవ్రతకు సూక్ష్మదాతు లోపాలు బయటపడి తోటలు పసుపు రంగులోకి మారుతుండటం కన్పిస్తుంది. సేంద్రియ ఎరువులు ప్రతి యేటా తప్పనిసరిగా రసాయన ఎరువులతో కలిపి వాడటం, తోటల మధ్యలో పచ్చిరొట్ట పంటలు సాగుచేసి భూమిలో కలియదున్నడం చేయడం ద్వారా చాల వరకు సూక్ష్మధాతు లోపాలు రాకుండా నివారించుకోవచ్చు.